క్లుప్తంగా

ఎస్పీకి అభినందనలు



కామారెడ్డి క్రైం: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన పోలీసు సేవా పతకాలలో భాగంగా ఉత్తమ సేవలకు గాను పోలీసు మహోన్నత సేవా పతకాన్ని పొందిన కామారెడ్డి ఎస్పీ శ్రీనివాస్ రెడ్డిని టీఎన్జీవోఎస్ ప్రతినిధులు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు నరాల వెంకట్ రెడ్డి, కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

బీబీపేట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఇస్సానగర్‌లో మెడిసిటీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 120 మందికి ఓపీ, 38 మందికి ఐపీ సేవలను అందించారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరం ఉన్న వారికి ఆపరేషన్ చేయిస్తామన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, వైస్ చైర్మెన్ నాగరాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి బీసీ కాలనీలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని బీసీ కాలనీలో గురువారం హెల్త్ క్యాంపు నిర్వహించినట్లు మత్తమాల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తెలిపారు. వైద్య పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు.

శివాలయానికి రూ.10 లక్షల విరాళం



కామారెడ్డి రూరల్: శాబ్దిపూర్ గ్రామంలో నిర్మిస్తున్న శివాలయానికి రూ.10 లక్షల నగదును అదే గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు నిమ్మ అంజల్ రెడ్డి విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆయనను గురువారం గ్రామస్తులు సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా అంజల్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. మాజీ ఎంపీటీసీ నిమ్మ విజయ్ కుమార్ రెడ్డి, గరిగె రామాగౌడ్, పస్తం పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

శివాయిపల్లిని సందర్శించిన డీఆర్‌డీఏ అధికారి

రాజంపేట: వాయిపల్లి గ్రామాన్ని గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్‌డీఏ) సాయన్న సందర్శించారు. గ్రామంలో మురుకు నీరు నిలవకుండా నిర్మిస్తున్న సోక్‌పిట్, కమ్యూనిటీ సోక్‌పిట్‌లను పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున పనులు వేగంగా చేపట్టాలని సర్పంచ్ విఠల్‌రెడ్డికి సూచించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలోని మౌలిక వసతుల గురించి హెచ్‌ఎం ముదాం స్వామిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో బాలకిషన్, టీఏ రాజు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ మేనేజర్‌గా శివాని

భిక్కనూరు: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ మేనేజరుగా శివాని గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు మేనేజర్‌గా పనిచేసిన ఆనంద్‌ను ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ చేసి హైదరాబాద్‌లోని శేర్ లింగంపల్లి ఎస్‌బీఐలో పనిచేస్తున్న శివానిని భిక్కనూరుకు బదిలీ చేశారు. తమ బ్యాంక్‌లో అధిక వడ్డీని అందించే పథకాలు ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

దోమకొండ తహసీల్దార్‌గా సంజయ్ రావు

దోమకొండ: దోమకొండ తహసీల్దార్‌గా సంజయ్‌రావ్ గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. నిజాంసాగర్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఇప్పటివరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ కౌశిక్‌రెడ్డి వ్యవహరించారు.

పర్యావరణ పరిక్షణ కోసం సైకిల్ యాత్ర

కామారెడ్డి టౌన్: పర్యావరణ పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న యువకుడు దిలీప్ కుమార్‌ను యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక కర్షక్ బీఈడీ కళాశాల ముందు ఆయనను సన్మానించారు. దిలీప్ మాట్లాడుతూ.. సమాజ హితం, పర్యవరణ కోసం 4 నెలల క్రితం గుజరాత్ నుంచి ఈ యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. 10 రాష్ట్రాలలో 9,300 కిలో మీటర్ల వరకు ఇప్పటి వరకు యాత్ర చేశానన్నారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చందు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఐరేని సందీప్, తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిపై చర్యల్లో నిర్లక్ష్యమేల?

- పోచమ్మ ఆలయ ఘటనలో నిందితుడిపై కఠిన చర్యలకు డిమాండ్
- మద్నూర్ బంద్ సంపూర్ణం



నిరసన తెలుపుతున్న వారిని సముదాయిస్తున్న బిచ్కుంద సీఐ కృష్ణ

మద్నూర్(జుక్కల్) : బారడి పోచమ్మ ఆలయంలో మాంసం, ఎముకలు పెట్టి అపచారం చేసిన నిందితుడిపై మద్నూర్ పోలీసులు తేలికైన చట్టాలు నమోదు చేసి కేసును నీరుగారుస్తున్నారని హిందూ సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుకు నిరసనగా గురువారం మద్నూర్ బంద్‌కు పిలుపునివ్వడంతో వ్యాపార సముదాయాలు, హోటళ్లు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. హిందు సంఘం, బీజేపీ నాయకులు, గ్రామస్తులు మద్నూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట టెంట్ వేసుకోని ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. నిందితుడు ఒకేరోజులో వ్యక్తిగత పూచీకత్తుపై బయటకు రావడంతో గ్రామస్తులు మండిపడ్డారు. కఠిన సెక్షన్లు పెట్టాలని పట్టుబట్టారు. బిచ్కుంద సీఐ కృష్ణ ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిపై అవసరమైన సెక్షన్లన్నీ పెట్టామని చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. అనంతరం వారంతా నిందితుడిపై మరోసారి ఫిర్యాదు చేసి ధర్నా విరమించారు.

రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి





బాన్సువాడలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు నస్రుల్లాబాద్ సబ్ స్టేషన్ వద్ద..



దోమకొండ సబ్‌స్టేషన్ ఎదుట ..

సాక్షి నెట్‌వర్క్:ఉచిత విద్యుత్‌పై పీసీసీ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం కూడా జిల్లాలో పలు చోట్ల ఆందోళనలు చేశారు. సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాలు నిర్వహించి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసి ఆయనకు వ్యతిరేకంగా నినాదాలిచ్చారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ రైతులకు నిరంతరం ఉచిత విద్యుత్ అందజేస్తున్న రైతు పక్షపాతి అని కొనియాడారు.

రోడ్లపై పశువులను వదిలేస్తే కేసులు పెడతాం

కామారెడ్డి టౌన్: పట్టణంలో ప్రధాన రోడ్లపై పశువులను వదిలేస్తే వాటి యజమానులపై కేసులు పెడతామని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సానిటరీ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ సిబ్బంది రోడ్లపై వదిలిన పశువుల యజమానులకు భారీగా జరిమానాలు విధించారు. రాత్రి సమయంలో వాహనాలు వెళ్లకుండా రోడ్లపై అడ్డంగా పశువులు పడుకుంటున్నాయని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వారు వివరించారు. ఇప్పటికైనా పశువుల యజమానులు స్పందించి వాటిని ఇంటి వద్ద కట్టేసుకోవాలన్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ ఉన్నారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



గాయపడ్డ సిద్ధరాములు

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలైనట్లు భిక్కనూరు ఎస్సై ఆనంద్‌గౌడ్ గురువారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కుర్రి సిద్ధరాములు ద్విచక్రవాహనంపై రామాయంపేట నుంచి భిక్కనూరు వైపు వస్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో సిద్ధరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

దుర్వినియోగానికి పాల్పడిన చైర్మన్‌ను తొలగించాలి



మాట్లాడుతున్న మదన్ మోహన్ రావు

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన చైర్మన్ దేవేందర్‌రెడ్డిని విధుల నుంచి తొలగించాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ రావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన లింగంపేట సింగిల్ విండో కార్యాలయం ఎదుట కాసేపు ఆందోళన చేసి అనంతరం మాట్లాడారు. సొసైటీలో రూ.78.80 లక్షల అవినీతి జరిగితే అధికారులు, స్థానిక ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయమైందని ఆరోపించారు. నిధులు దుర్వినియోగం అవుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఎమ్మెల్యేకు ఏమైనా వాటాలు ఇచ్చారా అనే అనుమానం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో బుర్ర నారా గౌడ్, జొన్నల రాజు, రఫీక్, తదితరులున్నారు.

కుక్కల బెడద తొలగించాలని వినతి

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూరు ఒకటో వార్డులో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే వాటి బారి నుంచి తమను రక్షించాలని కోరుతూ గ్రామస్తులు మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... కుక్కల బెడదతో చిన్న పిల్లలు, పెద్ద వారు సైతం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే పలువురిని కాటు వేశాయని తెలిపారు. అంతేగాకుండా మేకలు, గొర్రెలను చంపితింటున్నాయని పేర్కొన్నారు.

కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి పట్టణంలో కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ అన్నారు. గురువారం ఉదయం ఆయన ఎల్లారెడ్డిలో పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. ప్రతి రోజు విధులకు సక్రమంగా హాజరవ్వాలని, వీధులను పరిశుభ్రంగా ఊడ్చడంతో పాటు, మురికి కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. సిబ్బంది సాయిలు, మహేందర్ తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బీజేపీ యూత్ నాయకులు పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారికి సుభాష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. నాయకులు అఫీజ్, సుఖేందర్ రెడ్డి తదితరులున్నారు.

వాహనాల తనిఖీ

గాంధారి(ఎల్లారెడ్డి) : మండలంలో వాహనాలను తనిఖీ చేసి గురువారం పలువురిపై కేసులు నమోదైనట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. తిమ్మాపూర్ శివారులో మద్యం సేవిస్తున్న ఇద్దరిపై, ఎలాంటి ధ్రువ పత్రాలు లేకుండా వాహనాలు తిప్పుతున్న వారిపై కేసు నమోదు చేశామన్నారు.

సమాచారం..

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

రామారెడ్డి: ఉప్పలవాయిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులలో ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 15 ఉదయం 10 గంటల లోపు కళాశాలలో హాజరుకావాలని సూచించారు. పదవ తరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా ఖాళీలను భర్తీ చేస్తామని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మద్నూర్(జుక్కల్): పెద్ద ఎక్లార గేటు వద్ద గల బాలికల గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు మొదలయ్యాయని కళాశాల ప్రిన్స్‌పాల్ సవిత గురువారం తెలిపారు. కళాశాల కార్యదర్శి ఆదేశాల ప్రకారం ఎక్లార క్యాంపస్‌లో ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఆమె తెలిపారు. సీఈసీ గ్రూప్‌లో ఖాళీగా ఉన్న సీట్లకు 2023 మార్చిలో రాసిన వార్షిక పరీక్షలో ఉత్తీర్ణులైన పదో తరగతి బాలికలకు ఈ నెల 14న కౌన్సిలింగ్ నిర్వహించి స్పాట్ అడ్మిషన్లు చేస్తామని అర్హులైన బాలికలు ఒరిజినల్ టీసీ, ఆదాయ, కుల ధ్రువపత్రాలు తీసుకు రావాలని ఆమె సూచించారు. వివరాలకు 9704550265, 9666605599 ఫోన్ చేయవచ్చన్నారు.

నేడు సదాశివనగర్‌కు ఎమ్మెల్యే రాక

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలానికి శుక్రవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ రానున్నట్లు ఎంపీడీవో లక్ష్మి తెలిపారు. మర్కల్ స్టేజీ వద్ద గల అశోక్‌గార్డెన్స్‌లో పోడు భూముల పట్టాలను పంపిణీ చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

వాసవి అమ్మవారికి శాకంబరీ పూజలు

కామారెడ్డి అర్బన్: ఆషాఢ శుక్రవారం సందర్భంగా సిరిసిల్ల రోడ్డులోని వాసవి మాతా ఆలయంలో అమ్మవారికి శాకంబరీ విశేష పూజలు నిర్వహించనున్నట్టు ఆర్యవైశ్య సంఘం కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ తెలిపారు. పూజల సందర్భంగా పట్టణంలోని అన్ని గల్లీ సంఘాల బాధ్యులు, మహిళలు పాల్గొనాలని కోరారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గత నెల 18 వరకు నూతన పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులతో పాటు పోడు భూములకు పట్టాలు పొందిన రైతులు వెంటనే రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని నాగిరెడ్డిపేట మండల వ్యవసాయాధికారి విజయ్ శేఖర్ తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు వారు ఆగస్టు 5 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు పత్రంతో పాటు పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్సులను ఏఈవోలకు ఇవ్వాలని సూచించారు.

అవిశ్వాసంపై 7న బల నిరూపణ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి వైస్ ఎంపీపీ పెద్దెడ్ల నర్సింలుపై అవిశ్వాసానికి పలువురు ఎంపీటీసీలు ఇచ్చిన నోటీసుపై ఆగస్టు 7న స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బల నిరూపణ కోసం అధికారులు ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈమేరకు వైస్ ఎంపీపీ నర్సింలుతో పాటు ఎంపీపీ మాధవి, ఆరుగురు ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్ల మోసాలకు బలి కావొద్దు

రామారెడ్డి: గల్ఫ్ ఏజెంట్ల మాయమాటలు నమ్మి విజిట్ వీసాపై గల్ఫ్ దేశాలకు వెళ్లి మోసపోవద్దని ఎన్ఆర్ఐ సభ్యుడు హైమద్ సూచించారు. ఉప్పల్‌వాయి గ్రామవాసి పురం సాయిలు 25 రోజుల క్రితం విజిట్ వీసాపై వెళ్లి తినడానికి తిండి లేక మృత్యువాత పడ్డాడని, ఆయన మృతదేహాన్ని ఇండియాకు రప్పించడానికి బల్ల ఆంజనేయులు, ఆయన కుమారుడు సాయి తేజ, రాజంపేట మాజీ ఎంపీటీసీ గుర్రాల రాజు తనకు సహకరించారని హైమద్ పేర్కొన్నారు. మృతదేహాన్ని ఇండియాకు తరలించడానికి రూ.2 లక్షల వరకు ఖర్చయినట్లుగా వెల్లడించారు. హైమద్ గురువారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతుడి వస్తువులతో పాటు రూ.10 వేలు అందజేశారు.

ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా



ఇన్‌చార్జి ఎంపీపీ రాజ్‌దాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): అధికార పార్టీ ఎంపీటీసీ సభ్యులు తనపై చేసిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని, ఆరోపణలను నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీ రాజ్‌దాస్ తెలిపారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఇతర ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాసం పెట్టే క్రమంలో తనపై చేసిన పలు ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్‌కు మంజూరైన ఎస్‌ఆర్‌ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ఎంపీటీసీ సభ్యులందరి ఆమోదంతోనే పనులను వారికి అప్పగించానన్నారు. వైస్ ఎంపీపీగా ఎన్నికై ఇన్‌చార్జి ఎంపీపీగా కొనసాగిన ఈ నాలుగేళ్లలో ఎలాంటి సందర్భంలోనూ తాను ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదని పేర్కొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 12న ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులపై ఖమ్మంలో బౌన్సర్లతో దాడి చేయించిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు ఆందోళన చేశారు. స్కూల్ యాజమాన్యం దిష్టి బొమ్మను దహనం చేశారు. ఇది హేయమైన చర్య అని తక్షణమే అధికారులు స్పందించి స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు ముదాం అరుణ్‌కుమార్, జి.సురేష్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల జోలికొస్తే పుట్టగతులుండవు

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): రైతును రాజును చేయడం లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. 60 ఏళ్లు పాలించిన పార్టీలు రైతులను ఏనాడు పట్టించుకోలేదని, వారి జోలికి వస్తే పుట్టగతులు ఉండవని వ్యాఖ్యానించారు. గురువారం జుక్కల్ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి 24 గంటల కరెంట్ ఇస్తుంటే రేవంత్‌రెడ్డికి కళ్లు మండుతున్నాయన్నారు. రైతులకు మేలు చేయకుండా వ్యతిరేకంగా మాట్లాడటం సిగ్గుచేటని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదని లింగంపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్ అన్నారు. గురువారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సింగిల్ విండోలో అవినీతి జరిగితే చైర్మన్, సీఈవోపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలి కానీ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మదన్‌మోహన్ స్థాయికి తగినది కాదన్నారు. మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంపోస్ట్‌షెడ్డులో ఎరువును తయారు చేయించాలి



మాట్లాడుతున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రతి గ్రామంలో ఇళ్ల నుంచి సేకరించిన చెత్త ద్వారా కంపోస్టు షెడ్డులో ఎరువును తయారు చేయించాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలన్నారు. అలాగే బహిరంగ మల విసర్జన చేసే వారికి రూ.500 జరిమానా విధించాలన్నారు.

ఘనంగా గోరింటాకు కార్యక్రమం



భిక్కనూరులో గోరింటాకుతో మహిళలు

భిక్కనూరు: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు గౌరిదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి గోరింటాకుకు ప్రత్యేక పూజలు జరిపించారు. గోరింటాకు పెట్టుకుని సంబురాలు జరుపుకొన్నారు. అనతరం బతుకమ్మ, దాండియా ఆటలు ఆడారు.

వేతనాలు పెంచే వరకు సమ్మె ఆగదు



లింగంపేట: కామారెడ్డి-ఎల్లారెడ్డి రోడ్డు పక్కన కళ్లకు గంతలతో నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు

సాక్షి నెట్‌వర్క్ :తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సమ్మె గురువారం కూడా కొనసాగింది. వేతనాలు పెంచి, తమ సమస్యలన్నీ తీర్చేవరకు సమ్మె కొనసాగిస్తామని జీపీ కార్మికులు స్పష్టం చేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీవో- 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, పంపు ఆపరేటర్లకు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19500 చెల్లించాలని డిమాండు చేశారు. పలు చోట్ల కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కొన్ని చోట్ల ర్యాలీలు తీశారు. పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపి.. కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



తాడ్వాయిలో..



దోమకొండలో ..

సంక్షిప్తం

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

బాన్సువాడ రూరల్: ఇబ్రహీంపేట్‌లో గురువారం షాదీ ముబారక్ చెక్కులను సర్పంచ్ నారాయణరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి నవీన్, సొసైటీ డైరెక్టర్ కామేశ్వర్, రాజిరెడ్డి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిలు యాదవ్, వస్సీయోద్దీన్, సాయిలు తదితరులు ఉన్నారు.

పశు గ్రాసం విత్తనాలు..

బాన్సువాడ రూరల్: పశు గ్రాస వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని హన్మాజీపేట్‌లో పశు గ్రాస విత్తనాలను సర్పంచ్ సుభాష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ..పశుగ్రాసం రకాలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. పశు వైద్యాధికారి జైపాల్‌సింగ్, ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి, సాయిబాబా, సిబ్బంది ఖాదర్, తుకారం ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ

భిక్కనూరు: కంచర్లలో గౌడ సంఘ భవనం ప్రహరీ నిర్మాణానికి గురువారం సర్పంచ్ మాధవరెడ్డి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు సత్యగౌడ్, భిక్షపతి గౌడ్ పాల్గొన్నారు.

80వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

భిక్కనూరు: ఎంఎస్ఎన్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి వ్యతిరేకంగా వీడీసీ ఆధ్వర్యంలో కాచాపూర్‌లో నిర్వహిస్తున్న రిలే నిరసన దీక్షలు 80వ రోజుకు చేరుకున్నాయి. ఫ్యాక్టరీ నుంచి వ్యర్థాలు విడుదల కాకుండా చూడాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో నడిపితే చట్టరీత్యా చర్యలు

రాజంపేట: రోడ్లపై కేజ్‌వీల్స్‌తో నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని రాజంపేట ఎస్సై రాజు హెచ్చరించారు. కేజ్‌వీల్స్‌తో నడిపితే రోడ్లు దెబ్బతింటాయని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ట్రాక్టర్ యజమానులు సహకరించాలని కోరారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామంలో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని నాగిరెడ్డిపేట ఎంపీవో శ్రీనివాస్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేట జీపీ కార్యాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. కార్యదర్శి భూమేశ్వర్ ఉన్నారు.

దళిత సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

భిక్కనూరు: తిప్పాపూర్‌లో దళిత సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇల్లెందుల స్వామిరాజు, ఉపాధ్యక్షులుగా కోటిగల్ల మధుసూదన్, తుడుం పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్యామర్తి జగభూపాల్, సహాయ కార్యదర్శిగా కాశిగల్ల స్వామి, తదితరులు ఎన్నికయ్యారు. దళితుల సంక్షేమం కోసం కృషి చేస్తానని అధ్యక్షుడు స్వామిరాజు అన్నారు.

హైదరాబాద్ తరలిన ఎండీఎం నిర్వాహకులు

ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట: తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళనలో భాగంగా నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన ఏజెన్సీ(ఎండీఎం) నిర్వాహకులు గురువారం హైదరాబాద్ తరలివెళ్లారు. ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు వారు ప్రత్యేక వాహనంలో బయలుదేరారు.